Email : telanganaveenaoffcial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..




సంపుటి : 1 | సంచిక : 107 | హైదరాబాద్ | శనివారం | 30.12.2023 | పేజీలు : 1 | రూ 4/-

SPECIAL EDITION

# అయోధ్యలో ప్రధాని మోదీ పర్యటన..
# ఘనంగా స్వాగతం పలికిన 1400 మంది కళాకారులు..



తెలంగాణ వీణ, జాతీయం : ఆధ్యాత్మిక విశ్వనగరి అయోధ్య సర్వాంగసుందరంగ ముస్తాబవుతోంది. విశ్వవ్యాప్తంగా కోట్లాదిమంది రామ భక్తుల చిరకాల స్వప్నం సాకారం అవుతోంది. జనవరి 22న జరిగే విగ్రహ ప్రతిష్ఠాపనకు సర్వం సిద్ధమవుతోంది. అయోధ్య రామాలయం ప్రారంభానికి ఘనంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి.. రామమందిర ప్రారంభోత్సవానికి ముందు అయోధ్యలో వేల కోట్ల అభివృద్ధి పనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. అయోధ్యలో మోదీ పర్యటన సందర్భంగా అయోధ్య టెంపుల్ సిటీ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. మొదట అయోధ్యకు చేరుకున్న ప్రధాని మోదీకి ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ స్వాగతం పలికారు. అనంతరం టెంపుల్ సిటీలో ప్రధాని మోదీ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధానికి కళాకారులు, ప్రజలు రోడ్డుకు ఇరు వైపులా నిలబడి.. అపూర్వ స్వాగతం పలికారు. పూల వర్షం కురిపిస్తూ ప్రధాని మోదీకి స్వాగతం పలికారు. అయోధ్య నగరానికి 15 కి.మీ.ల దూరాన ఉన్న ఎయిర్‌పోర్టు నుంచి రైల్వేస్టేషనుకు వెళ్లే మార్గం పొడవునా 40 వేదికలపై 1,400 మంది కళాకారులు వివిధ కళారూపాలను ప్రదర్శిస్తూ ప్రధాని మోదీకి స్వాగతం పలికారు.అయోధ్య పర్యటనలో భాగంగా అయోధ్య రైల్వే స్టేషన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. రెండు అమృత్ భారత్ రైళ్లు, ఆరు వందేభారత్ రైళ్లకు పచ్చజెండా ఊపారు. అనంతరం ప్రధాని మోదీ విద్యార్థులతో ముచ్చటించారు. ఈ కార్యక్రమాల అనంతరం మహర్షి వాల్మీకి అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం పక్కనున్న మైదానంలో ఏర్పాటుచేసే 'జన్ సభ'లో ప్రధాని మోదీ మాట్లాడనున్నారు.ప్రధాని పర్యటన సందర్భంగా అయోధ్యలో భద్రతను కట్టుదిట్టం చేశారు.ప్రధాని సందర్శించే ఎయిర్‌పోర్టు, రైల్వే స్టేషన్ పరిసరాల్లో డ్రోన్ల ద్వారా నిఘా పెడుతున్నారు. ఎటువంటి అవాంతరాలు తలెత్తకుండా మొత్తం రీహార్సల్ కూడా చేశారు.. అయోధ్యలో మోడీ పర్యటన నేపథ్యంలో భారత్ – నేపాల్ సరిహద్దుల్లో నిఘాను పటిష్ఠం చేశారు. ప్రధాన రహదారుల్లో మెటల్ డిటెక్టర్లు ఏర్పాటుచేసి, జాగిలాలతోపాటు ఒక ప్లాటూను మహిళా రక్షకదళాన్ని నియమించారు. సరిహద్దులోని ప్రార్థన మందిరాలపై నిఘా పెట్టారు.

## ముస్లిం దేశంలో హిందూ ఆలయం నిర్మాణం





తెలంగాణ వీణ, జాతీయం : దేశ విదేశాల నుంచి వేలాది మంది అయోధ్యకు చేరుకుంటున్నారు. ప్రధాని మోడీ ఆ చారిత్రాత్మక ఘట్టంలో ప్రధాన భూమికను పోషించనున్నారు. అదే సమయంలో అయోధ్యకు 2800 కిలోమీటర్ల దూరంలో ఉన్న ముస్లిం దేశంలో భారీ ఆలయాన్ని నిర్మిస్తున్నారు. ఈ ఆలయాన్ని కూడా ప్రధాని మోడీ ప్రారంభించనున్నారు. ఆ ముస్లిం దేశం అబుదాబి. ఇక్కడ నిర్మించిన BAPS హిందూ దేవాలయం గురించి ఈ రోజు తెలుసుకుందాం.. ఈ ఆలయాన్ని ఫిబ్రవరిలో భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రారంభించనున్నారు.భారతదేశానికి దాదాపు 2800 కిలోమీటర్ల దూరంలోని అబుదాబిలో నిర్మిస్తున్న మొట్ట మొదటి హిందూ దేవాలయం.. ఇప్పుడు చివరి దశకు చేరుకుంది. ఈ ఆలయం భారతదేశం ఆధ్యాత్మికత, సనాతన సంప్రదాయానికి కేంద్రంగా మాత్రమే కాకుండా.. ఈ ఆలయ నిర్మాణం కారణంగా రెండు దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడి జరుగుతుంది. రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడతాయి.ఈ హిందూ ఆలయం అబుదాబిలో మొట్టమొదటిది. ఈ ఆలయం 55,000 చదరపు మీటర్లలో నిర్మించబడింది. భారతీయ కళాకారులతో అందంగా నిర్మిస్తున్నారు. ఈ ఆలయ నిర్మాణంలో 50,000కు పైగా ఇటుకలను ఉపయోగించారు. విశేషమేమిటంటే ఈ ఆలయ నిర్మాణంలో భారతదేశంలోని ప్రముఖ నటులు సంజయ్ దత్, అక్షయ్ కుమార్ కూడా సహకరించారు.

ఆలయ విశిష్టత ఏమిటి?

ఈ భారీ ఆలయాన్ని నిర్మాణంలో భారత దేశంలోని వేద వాస్తు శిల్పం ఉపయోగించబడింది, ఈ ఆలయంలో ఉంచబడిన దేవతలు, దేవతల విగ్రహాలు భారతదేశంలో తయారు చేయబడ్డాయి. అలాగే ఇందులో క్లిష్టమైన చెక్కడాలు, పాలరాతి రాళ్లను ఉపయోగించారు. ఈ దేవాలయం ఎత్తు దాదాపు 108 అడుగులు కాగా ఇందులో 180 వేల క్యూబిక్ మీటర్ల బుల్లా రాళ్లను ఏర్పాటు చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి దాదాపు రూ.700 కోట్లు ఖర్చు చేశారు.అబుదాబిలోని ఈ విలాసవంతమైన ఆలయం ఏడు శిఖరాలను కలిగి ఉంటుంది. వీటిలో ప్రతి శిఖరం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. ఈ ఆలయంలో ఎగ్జిబిషన్ సెంటర్, తరగతి గదులు, ఆట స్థలం కూడా ఉన్నాయి.

## సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అక్కినేని నాగార్జున దంపతులు



తెలంగాణ వీణ, హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి పుష్పగుచ్ఛం ఇచ్చి ఫొటోలు దిగారు. రేవంత్ రెడ్డి సీఎం అయిన తర్వాత నాగార్జున దంపతులు ఆయన్ను కలవడం ఇదే మొదటిసారి. రేవంత్ రెడ్డి సీఎం అయినప్పటి నుంచి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయటానికి పలువురు ప్రముఖులు కలుస్తున్నారు. మరోవైపు సీఎం రేవంత్ 100 రోజుల్లో ఆరు గ్యారంటీల అమలు దిశగా ప్రజా పాలన కార్యక్రమం చేపట్టారు.

## రైతుభరోసా, పింఛన్లపై అపోహలొద్దు
## – పాత లబ్ధిదారులందరికీ కొనసాగిస్తాం

తెలంగాణ వీణ, హైదరాబాద్ : ప్రజాపాలన దరఖాస్తులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజాపాలన దరఖాస్తులు అమ్మకాలపై ఇటీవల మీడియాలో కథనాలు రావడం గమనించిన సీఎం ఈ విషయంపై ఆరాతీశారు. దరఖాస్తులు విక్రయించే వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అవసరమైనన్ని అర్జీలు అందుబాటులో ఉంచాల్సిందేనని స్పష్టం చేశారు.రైతుభరోసా, పింఛన్లపై అపోహలొద్దని, పాత లబ్ధిదారులందరికీ యథాతథంగా లబ్ధి చేకూరుతుందని చెప్పారు. కొత్తగా లబ్ధి పొందాలనుకునేవారే దరఖాస్తు చేసుకోవాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఈ సమీక్ష అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రులు కలిశారు. నారాయణస్వామి, వైద్యలింగం ఇతర ప్రముఖ నాయకులు ఉన్నారు.



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా కోదండరాం, అందెశ్రీ?

తెలంగాణ వీణ, హైదరాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం గవర్నర్ కోటా కింద టీజేఎస్ అధినేత కోదండరాం, ప్రజా కవి అందెశ్రీని శాసనమండలికి పంపనుందా? ఎమ్మెల్సీలుగా వీరిద్దరి పేర్లను పరిశీలిస్తోందా? అంటే సంబంధిత వర్గాలు అవుననే అంటున్నాయి. ప్రస్తుతం గవర్నర్ కోటా కింద శాసనమండలిలో రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాలకు కోదండరాం, అందెశ్రీలను ఎంపిక చేస్తే ఎలా ఉంటుందన్న పరిశీలన జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు కోదండరాం బేషరతుగా మద్దతు ఇవ్వడంతో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన్ను గౌరవప్రదమైన పదవిలోకి తీసుకుంటామంటూ ఆ పార్టీ అధిష్ఠానం హామీ ఇచ్చింది. ఈ క్రమంలో కోదండరామ్‌కు ప్రభుత్వ సలహాదారుగా లేదా ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా లేదా రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇస్తారంటూ ప్రచారం జరిగింది. అయితే ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా వేం నరేందర్‌రెడ్డితో పాటు మరొకరి పేరును పరిశీలిస్తున్నారు. రాజ్యసభ సీటుకు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డితో పాటు మరి కొందరు సీనియర్ నాయకులు పోటీ పడుతున్నారు. ఈ నేపథ్యంలో కోదండరాంను ప్రభుత్వ సలహాదారుగా తీసుకోవాలా.. లేక గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలా అన్నదానిపై తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. తెలంగాణ ఉద్యమానికి తన పాటలతో సహకరించిన అందెశ్రీని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలన్న ప్రతిపాదనా పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కె.సత్యనారాయణ పేర్లను సిఫారసు చేసింది. అయితే గవర్నర్ కోటా కింద ఎంపికయ్యే అర్హత వారికి లేదంటూ గవర్నర్ తమిళిసై ఆ సిఫారసును తిరస్కరించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ రెండు స్థానాలనూ సామాజిక రంగంలో సేవలందించిన కోదండరాం, సాహిత్య రంగంలో సేవలందించిన అందెశ్రీ పేర్లను సిఫారసుచేసే అంశంపై పరిశీలన జరుగుతున్నట్లు చెబుతున్నారు.

## ఆరు గ్యారెంటీల విషయంలో చాలా సందేహాలు ఉన్నాయి..
# ఎమ్మెల్సీ కవిత



తెలంగాణ వీణ, హనుమకొండ : బీఆర్ఎస్ కార్యకర్తలు ఎట్టి పరిస్థితుల్లోనూ మనోస్థైర్యాన్ని కోల్పోవద్దని ఎమ్మెల్సీ కవిత సూచించారు. రాజకీయాల్లో ఎగుడుదిగుడులు ఉంటాయని.. ఇలాంటి పరిస్థితులు వస్తుంటాయని అన్నారు. కానీ సంయమనం పాటించి, ఓపికతో ఉండి.. మన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. ప్రజల మనసును గెలుచుకోవడం ద్వారా మళ్లీ మంచి స్థానంలో సుస్థిరంగా వెనక్కిరావడం జరుగుతుందని అన్నారు. ధైర్యం కోల్పోకుండా బలంగా ఉండాలని సూచించారు. హనుమకొండలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఎమ్మెల్సీ కవిత శనివారం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం పింఛన్లు వస్తున్న 44 లక్షల మందికి రూ.4వేలకు పెంచి.. ఆ తర్వాత కొత్త దరఖాస్తులు తీసుకుంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తుల విషయంలో ప్రజల్లో అనేక సందేహాలు ఉన్నాయని ఆమె అన్నారు. అన్ని వివరాలు అడుగుతున్నారు కానీ బ్యాంక్ అకౌంట్ వివరాలు అడగట్లేదని అయోమయంలో ఉన్నారని అన్నారు. బ్యాంక్ అకౌంట్ మళ్లీ అడుగుతారా? లేదా కాలయాపన చేసే ప్రయత్నం జరుగుతుందా అనే చర్చ ప్రజల్లో ఉందన్నారు. 200 యూనిట్ల కంటే తక్కువ వినియోగించే వారికి ఫ్రీ కరెంట్ ఇస్తామని చెప్పారు కాబట్టి.. వచ్చే జనవరిలో కరెంటు బిల్లులు కట్టాలా? వద్దా? అనే చర్చ ప్రజల్లో జరుగుతుందని గుర్తు చేశారు. ఇదే కాకుండా జనాల్లో ఇంకా చాలా అనుమానా ఉన్నాయని అన్నారు. చాలా ఇండ్లలో మగవాళ్ల పేరు మీదనే గ్యాస్ సిలిండర్లు ఉన్నాయని.. అలాంటి వాళ్లకు 500 గ్యాస్ సిలిండర్ వర్తిస్తుందా? లేదా? అని చాలామంది ప్రశ్నిస్తున్నారని అన్నారు. నిరుద్యోగ భృతిపై ఫామ్‌లో అడగలేదని కూడా సందేహంలో ఉన్నారని అన్నారు.